యుద్ధం ఆరంభమైనది. ఫిరంగి గుళ్లు కిందికి దూసుకుపోతున్నవి.

''జై రంగనాథ!'' కేకలు కోటపైనించి మిన్నంటుతున్నవి. కోట దరిదాపులకు రావడానికి సాహసించిన ఏ శత్రు సైనికుడైనా మట్టికరుస్తున్నాడు.. పైనించి కురిసే ఫిరంగి గుళ్లు, బరిశెల ధాటికి. రోజులు గడిచినకొద్దీ యుద్ధం భీకరమవుతున్నది. తెగించిన కుతుబ్‌షాహీ సైన్యం ముందుకు తోసుకువచ్చినపుడల్లా.. అంతే దీటుగా బురుజుపైనించి ఎదురుదాడి జరుగుతున్నది. బరిశెలు, శతఘ్నులు రెండువైపులా ప్రాణాలు తీస్తున్నయి, రక్తం కళ్ల జూస్తున్నయి.

* * *

గండికోట చరిత్ర పదమూడో శతాబ్దం రెండో అర్ధభాగంలో మొదలైంది. విజయనగర సామ్రాజ్య స్థాపకుడు బుక్కరాయలు క్రీ.శ. 1356లో మిక్కిలినేని రామానాయుడనే యోధుణ్ని గండికోటలో సామంతునిగా నియమించాడు. ఆ తరవాత గండికోట విజయనగర సామ్రాజ్యానికి వెన్నెముకగా నిలవగా, విజయనగర రాజులకు విశ్వాసపాత్రులై, పలు యుద్ధాలలో తురుష్కులను ఓడించి, ప్రసిద్ధిగాంచిన పెమ్మసాని నాయకులకు నెలవైంది. తెలుగు వారి శౌర్య ప్రతాపాలకు, దేశాభిమానానికి, హిందూధర్మ సంరక్షణ తత్పరతకు ప్రతీకగా నిలిచింది గండికోట!

క్రీ.శ. 1565 తళ్లికోట యుద్ధంలో అళియ రామరాజు పరాజయం..



విజయనగర సామ్రాజ్య పతనానికి దారితీసింది. అంతవరకూ అణగిమణగి ఉన్న దక్కను సుల్తానులు విజృంభించి.. సామ్రాజ్యంలోని ఒకొక్క ప్రాంతాన్నే గదుముకొనడానికి పోటీలు పడుతున్న తరుణమది. బీజాపూర్ సుల్తాను ఆదిల్‌షా, గోల్కొండ నవాబు కుతుబ్‌షాల మధ్య ప్రధానంగా ఇక్కడ పోటీ. వజ్రాల గనులకు నెలవైన గుత్తి దుర్గం, గండికోట దుర్గాలను లొంగదీయడానికి మీర్ జుమ్లాను అబ్దుల్లా కుతుబ్‌షా పురమాయించాడు. గండికోటపైన యుద్ధ మేఘాలు కమ్ముకున్నవి. విజయనగర సామ్రాజ్యాన్ని పునరుజ్జీవింపజేయాలంటే.. తిమ్మానాయుడు యుద్ధం గెలిచేతీరాలి.

* * *

రోజులు గడిచినకొద్దీ ఫ్రెంచివారి ఫిరంగుల ధాటికి కోట గోడలు బీటలు వారుతున్నవి. అయినా అంత సులభంగా పడిపోయే కట్టడం కాదది! కానీ రేపు ఏమవుతుందో ఎవరికెరుక?

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.

రాణి చిన్నమ్మ రంగనాథునికి మొక్కులు మొక్కుతున్నది. అంతఃపురాన్ని ఆనుకుని ఉన్న విశాలమైన గదిలో స్త్రీలంతాచేరి బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు, తమ పిల్లలను అక్కున చేర్చుకుని.

మీర్ జుమ్లాలో అంతకంతకూ అసహనం పెరిగిపోతున్నది. మూడు నెలలు కావస్తున్నది.. యుద్ధం మొదలై! కోటలో ఎక్కుపెట్టిన ఫిరంగుల ధాటికి తాను ఇక్కడ, ఇంతదూరంలో మకాం వేయవలసి వచ్చింది. భారీ సేన ఉంది.. ఏం లాభం? పిడికిళ్లు బిగుస్తున్నయ్.. తనలోని అసహనాన్ని సూచిస్తూ. తన విశాలమైన గుడారంలో బోనులో పులిలా పచార్లు చేస్తున్నాడు జుమ్లా. పొదిలి లింగన్నను చూసి..

''చంద్రగిరి కోట, ఇతర కోటలు సులువుగా పట్టుకున్నా. ఈ కోట గట్టిదని తెలుసు, పడితే ఇలాంటిదాన్నే పట్టాలి! ఇప్పుడు మన జిత్తులు ఉపయోగించే సమయం వచ్చింది'' అన్నాడు.

పొదిలి లింగన్న గొంతు సవరించుకున్నాడు.

''సాహెబ్! ఇలాంటప్పుడే మన యుక్తిని వినియోగించాలి! ఒకసారి కూర్చోండి చెపుతాను!''.

జుమ్లా వచ్చి తన కుర్చీలో కూర్చుని..

''చెప్పండి!'' అన్నాడు.

''తిమ్మానాయుడి పరిస్థితీ బాగాలేదు. ఎంతకాలం కూర్చుంటాడు కోటలో? మనం ఒక ఒప్పందం కొరకు మనిషిని రాయబారం పంపిద్దాం. కోట అప్పజెపితే.. బదులుగా గుత్తి దుర్గాన్ని తనకు ఇస్తామని లేఖ పంపండి! తప్పక ఒక మెట్టు దిగివస్తాడు తిమ్మడు. ఒప్పుకొన్నాక ఏంచెయ్యాలో చూద్దాం.. ఉత్త మాటేగా ఇచ్చేది!'' అంటూ కన్నుగీటాడు.

''అయితే నువ్వే ముందుండి రాయబారం నడిపించు!'' అన్నాడు మీర్ జుమ్లా.

* * *

తన సమావేశమందిరంలో చిన తిమ్మానాయుడు కూర్చుని ఉన్నాడు. మంత్రి చెన్నమరాజు వయసులో పెద్దవాడు. ఆయన దృష్టిలో ఇదొక మంచి అవకాశం. కోటలో స్త్రీలు, పిల్లల క్షేమంకోసం మీర్ జుమ్లా షరతులు ఒప్పేసుకోమని సలహాఇచ్చాడు. పరదా చాటునించి రాణి చిన్నమ్మ వింటున్నది.. గుబగుబలాడే గుండెలతో.

''ఇది ఆ పొదిలి లింగన్న కుతంత్రమని నా నమ్మకం బావా! వాళ్లు మాటమీద నిలబడతారని నమ్మకమేమిటి?'' అంటూ నరసింహనాయుడు తన మనసులో మాట చెప్పాడు.

తిమ్మానాయుడు గంభీరమైన కంఠంతో బదులిచ్చాడు.

''వాడు భిక్షపెడతాడా నాకు.. గుత్తి దుర్గం? విజయమో, వీరస్వర్గమో.. యుద్ధమే మన ముందున్న మార్గం. మన దళపతులను హెచ్చరించండి అప్రమత్తంగా ఉండమని. అంతిమ విజయం మనదే!''.

రాణి చిన్నమ్మ బరువైన గుండెలతో బయటికి నడిచింది, స్త్రీలు తలదాచుకున్న మందిరంవైపు. రాచస్త్రీలంతా వాళ్లలో వారే ఒకరికొకరు ధైర్యం చెప్పుకోవాల్సిన దుర్భరస్థితి అది. మగవాళ్లంతా యుద్ధంలో తలమునకలై ఉన్నారు మరి!

* * *

మళ్లీ యుద్ధం మొదలు.

మైలీకి ఆజ్ఞనిచ్చాడు జుమ్లా..

''నువ్వేం చేస్తావో నాకు తెలియదు. మూడు ఫిరంగులను కొండపైకి చేర్చాలి. ఎంతమంది సైనికులు